బుధవారం 29 జనవరి 2025

తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 71 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

విలేకరులు కావలెను

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834

కాంగ్రెస్ పార్టీకి మరో షాక్

- ఆప్‌కే ఆ కీలక మైనార్టీ నేత మద్దతు!
- కాంగ్రెస్ పార్టీ తన మిత్రపక్షాల మద్దతు సమకూర్చుకోలేకపోతోంది.
- తృణమూల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శరద్ పవార్ వర్గం సహా మరికొన్ని ఇండి కూటమి పార్టీలు కాంగ్రెస్‌ను కాదని ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు
- లౌకికవాదుల ఓట్లు చీలకుండా చూడాలి
- ఈ క్రమంలో ముస్లిం ఓటర్లంతా కేజ్రీవాల్‌కే ఓటేసి గెలిపించాలని అజ్మల్ పిలుపు

రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థలు

- రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- "విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకురావాలనేది మా ప్రయత్నం
- పెట్టుబడుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘన విజయం సాధించింది
- ప్రభుత్వం ఏర్పడ్డాక 14 నెలల్లో ప్రజల విశ్వాసాలను చూరగొన్నాం
- ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమతో ఒప్పందం కోసం ముందుకు వచ్చాయి
- రాష్ట్రంలోని యువతకు ఈ ఒప్పందాల ద్వార ఉపాధి దొరుకుతుంది
- దావోస్ పర్యటనపై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల రాకపై సీఎం రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. తన దావోస్ పర్యటన గురించి సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం మంత్రులతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పెట్టుబడుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘన విజయం సాధించిదన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక 14 నెలల్లో ప్రజల విశ్వాసాలను చూరగొన్నామని సీఎం అన్నారు, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తమకు అప్పగించిన భాద్యతను తాము నిర్వహిస్తున్నామన్నారు.దావోస్ పర్యటనలో ఎన్నడూ ఊహించని రీతిలో రూ. 1.80 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. ఎన్నో అంతర్జాతీయ సంస్థలు తమతో ఒప్పందం కోసం ముందుకు వచ్చాయని, రాష్ట్రంలోని యువతకు ఈ ఒప్పందాల ద్వార ఉపాధి దొరుకుతుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్‌కు - మిగతా3లో

రేవంత్‌రెడ్డి దృష్టిలో మోసం చేసుడు కూడా చారిత్రాత్మకమే

- నల్లగొండ రైతు ధర్నాలో కేటీఆర్..
- సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండు
- అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదు
- రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ప్లాప్ అయ్యింది
- రాష్ట్రంలో ఏ ఊర్లో చూసుకున్నా పావులా వంతు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు
- 'ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు.

నల్లగొండ

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పెద్దపెద్ద మాటలు చెప్పిండని, అధికారంలోకి వచ్చినంక ఒక్క మాట కూడా నిలబెట్టుకోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నల్లగొండ రైతు ధర్నా లో మాట్లాడిన కేటీఆర్.. రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ సర్కారు అట్టర్‌ప్లాప్ అయ్యిందన్నారు. రాష్ట్రంలో ఏ ఊర్లో - మిగతా3లో

ఎక్స్ పీరియం పార్క్ బాగా నచ్చింది

- ఇక్కడ షూటింగ్ చేస్తా
- ఎక్స్ పీరియం పార్క్ హైదరాబాద్‌కు తలమణికంగా మారుతుంది
- రామ్‌దేవ్ 2000 సంవత్సరంలో మొదలు పెట్టారు
- ఇక్కడ ఏర్పాటు చేసిన చెట్లు అన్ని నన్ను టెంప్ట్ చేస్తున్నాయి

రంగారెడ్డి

ప్రపంచంలోని అతి పెద్దదైన ఏకో ఫ్రెండ్లీ పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ... "ఎక్స్ పీరియం పార్క్ మీకంటే ముందు నాకు బాగా నచ్చింది. ఎక్స్ పీరియం పార్క్ హైదరాబాద్‌కు తలమణికంగా మారుతుంది. రామ్‌దేవ్ 2000 సంవత్సరంలో మొదలు పెట్టారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చెట్లు అన్ని నన్ను టెంప్ట్ చేస్తున్నాయి. రామ్‌దేవ్ చాలా రీసెర్చ్ చేసి విదేశాల మొక్కలు తెచ్చి - మిగతా3లో

31 నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- రెండు విడుతలుగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు
- 31న ప్రసంగించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- తొలి విడత 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి
- ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడుతారు



అక్రమ వలసదారులపై భారత్‌తో చర్చలు

- 'ఏది సరైన పనో' ప్రధాని నరేంద్ర మోడీ అదే చేస్తారు
- ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో వైట్ హౌస్‌ను సందర్శించే అవకాశం ఉంది
- చైనా భారీగా టారిఫ్‌లు విధిస్తుంటుంది
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

రేవంత్ లెక్కేంటో?

- రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందా?
- రేవంత్ రెడ్డి ఇలాంటి పాలన నాలుగేళ్లు చేస్తే మరో పదిహేనేళ్లు ప్రజలు బీఆర్ఎస్‌కేనా అధికారం
- మరోసారి కేసీఆర్ సీఎం అవుతారని అంటున్న భారత రాష్ట్ర సమితి నేతలు
- కానీ రేవంత్ రెడ్డి మాత్రం.. తెలంగాణ ప్రజలు తనకు పదేళ్లు అధికారం ఖచ్చితంగా ఇస్తారని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు
- తెలంగాణ సమాజం ఎవరికైనా పదేళ్ల సమయం ఇస్తోందనే నమ్మకంలో సీఎం

హైదరాబాద్

మరో నాలుగేళ్లే ఖచ్చితంగా మరోసారి కేసీఆర్ సీఎం అవుతారని భారత రాష్ట్ర సమితి నేతలు అంటున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వంపై పూర్తి స్థాయిలో వ్యతిరేకత పెరిగిందని రేవంత్ రెడ్డి ఇలాంటి పాలన నాలుగేళ్లు చేస్తే మరో పదిహేనేళ్లు ప్రజలు బీఆర్ఎస్‌కు అధికారం ఇస్తారని అంటున్నారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం.. తెలంగాణ ప్రజలు తనకు పదేళ్లు అధికారం ఖచ్చితంగా ఇస్తారని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. తన నమ్మకానికి ఆయన ఓ లాజిక్ కూడా చెబుతున్నారు. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. యువతకు ఉద్యోగాలు కల్పించేలా పదేళ్లకు సరిపడా ప్రణాళికలు వేయమని చెప్పానని దాని ప్రకారం ఏం కావాలన్నా చేస్తామన్నారు. ఐదేళ్లే అధికారం కదా పదేళ్లకు ప్రణాళికలు ఎందుకో కూడా రేవంత్ చెప్పారు. తెలంగాణ సమాజం ఎవరికైనా పదేళ్ల సమయం ఇస్తోందని రేవంత్ చెబుతున్నారు. చంద్రబాబు రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత వచ్చిన వైఎస్ఆర్‌కు కూడా రెండు సార్లు గెలిచారు. తర్వాత కేసీఆర్ కు కూడా - మిగతా3లో

భారత జాలర్లపై శ్రీలంక నేవీ కాల్పులు

- తీవ్రంగా స్పందించిన ఎంఈఏ
- ఈ ఘటనలో ఐదుగురు మత్స్యకారుల గాయాలు
- దీనిపై న్యూఢిల్లీలోని శ్రీలంక యాక్టింగ్ హైకమిషనర్‌కు సమన్లు పంపిన భారత్
- తీవ్ర నిరసన వ్యక్తం చేసిన ఇండియా
- శ్రీలంక, భారత్ మధ్య ఉన్న జాలర్ల సమస్యను పరిశీలించాలని విదేశాంగ శాఖ ప్రకటన

అక్రమ వలసదారులపై భారత్‌తో చర్చలు

వాషింగ్టన్ : అక్రమ వలసదారులపై భారత్‌తో చర్చలు సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలియజేశారు. 'ఏది సరైన పనో' ప్రధాని నరేంద్ర మోడీ అదే చేస్తారని అన్నారు. ఫ్లోరిడా నుంచి జాయింట్ బేస్ ఆండ్రూస్‌కు తిరుగు ప్రయాణంలో ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడినప్పుడు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో వైట్ హౌస్‌ను సందర్శించే అవకాశం ఉందని కూడా ఆయన ప్రకటించారు. విడిగా ఉభయ అధినేతల మధ్య ఫోన్ కాల్ గురించిన ఒక నివేదికను వైట్ హౌస్ చదువుతూ, మోడీతో ట్రంప్ 'ఉత్పాదక' ఫోన్ కాల్ చేశారని, భారత్, యుఎస్ మధ్య 'న్యాయమైన' ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు, ప్రగాఢ సహకారం దిశగా సాగాలని ట్రంప్ కోరారని తెలియజేసింది.కాగా సోమవారం ఫ్లోరిడా రిట్రీట్‌లో హౌస్ రిపబ్లికన్లతో అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ, అమెరికాకు 'హాని కలిగించే' దేశాలపై యుఎస్ టారిఫ్‌లు విధించగలదని చెప్పారు. ఆయన ఈ సందర్భంగా అధిక టారిఫ్ దేశాలుగా చైనా, ఇండియా, బ్రెజిల్‌లను ప్రస్తావించారు. 'మనకు నిజంగా హాని కలిగిస్తున్నారని

భావించే బాహ్య దేశాలు, బాహ్య వ్యక్తులపూ మనం టారిఫ్‌లు విధించబోతున్నాం. ఇతరులు ఏమి చేస్తున్నారో చూడండి. చైనా భారీగా టారిఫ్‌లు విధిస్తుంటుంది. భారత్, బ్రెజిల్, అనేక ఇతర దేశాలు కూడా. కనుక మనం అమెరికా ఫస్ట్ అనే విధానాన్ని పాటించబోతున్నందున దానిని ఇక ఎంత మాత్రం జరగనివ్వం' అని ఆయన చెప్పారు. ఇది ఇలా ఉండగా, తమ ఫోన్ కాల్‌తో ఉభయ అధినేతలు మోడీ యుఎస్ పర్యటన ప్లాన్ల గురించి కూడా చర్చించారని వైట్ హౌస్ ఆ నివేదికలో తెలియజేసింది. ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడినప్పుడు 'అక్రమ వలసదారులను తిరిగి తీసుకోవడానికి ఆయన (మోడీ) అంగీకరించారా' అని ట్రంప్‌ను ప్రశ్నించారు. 'ఆయన (మోడీ) ఏది సరైనదో అదే చేస్తారు.మేము చర్చించుకుంటున్నాం' అని ట్రంప్ తెలిపారు. 'నేను ఆయనతో సోమవారం ఉదయం సుదీర్ఘ ఫోన్ కాల్ జరిగింది. ఆయన వచ్చే నెల, బహుభా ఫిబ్రవరిలో వైట్ హౌస్‌కు రానున్నారు. మాకు భారత్‌తో ఎంతో మంచి అనుబంధం ఉంది' అని ట్రంప్ ఎయిర్ ఫోర్స్ వన్‌లో విలేకరులతో చెప్పారు. సోమవారం మోడీతో జరిపిన ఫోన్ కాల్‌పై ఒక ప్రశ్నకు అధ్యక్షుడు ఆ విధంగా సమాధానం ఇచ్చారు. ప్రధానితో ఫోన్ కాల్ వివరాల గురించి విలేకరులు ప్రశ్నించినప్పుడు 'మోడీతో ఫోన్ కాల్‌లో) ప్రతిదీ ప్రస్తావనకు వచ్చింది' అని ట్రంప్ సమాధానం ఇచ్చారు. ట్రంప్ 2.0 సమయంలో యుఎస్‌కు ప్రధాని మోడీ తొలి పర్యటన ఆ ఫోన్ కాల్‌లో ఖరారైంది. అధ్యక్షుడుగా ట్రంప్ చివరి విదేశీ పర్యటన ఆయన మొదటి హయాంలో భారత్‌లో జరిగింది.

కాంగ్రెస్ పార్టీకి మరో షాక్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్ పార్టీ తన మిత్రపక్షాల మద్దతు సమకూర్చుకోలేకపోతోంది. ఇప్పటికే ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షాలైన సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శరద్ పవార్ వర్గం సహా మరికొన్ని ఇండి కూటమి పార్టీలు కాంగ్రెస్‌ను కాదని ఆమ్ ఆద్మీ పార్టీకి మద్దతు ప్రకటించాయి. ఇప్పుడు ముస్లిం ఓటర్లలో పట్టున్న 'ఆలిండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్' అధినేత మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ కూడా కాంగ్రెస్‌ను కాదని ఆప్ వైపు నిలిచారు. లౌకికవాదుల ఓట్లు చీలకుండా చూడాలని, ఈ క్రమంలో ముస్లిం ఓటర్లంతా కేజ్రీవాల్‌కే ఓటేసి గెలిపించాలని అజ్మల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇప్పటికే మిత్రపక్షాల్లో ఒక్కొక్క పార్టీ కాంగ్రెస్‌ను కాదని ఆప్‌కు మద్దతు ప్రకటిస్తుండగా.. మైనారిటీ ఓట్లపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అజ్మల్ ప్రకటన మరొక శరాఘాతంగా మారింది. దేశంలో పరిస్థితులు అత్యంత సమస్యాత్మకంగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో సెక్యులర్ ఓట్లను విభజించవద్దని అజ్మల్ వారించారు.

ద్విముఖ పోరుగా మార్చే వ్యూహం!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల్లో భారతీయ జనతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీతో పాటు గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ కూడా ఉంది. పూర్తిగా పట్టణ ప్రాంత ఓటర్లు ఢిల్లీలో ఒకప్పుడు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం తర్వాత ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మిత్రపక్షాల మద్దతుతో దేశవ్యాప్తంగా కొంత పుంజుకున్న కాంగ్రెస్.. ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో పరాభవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా గెలుపొంది, తన పూర్వవైభవాన్ని చాటుకోవాలని తహతహలాడింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా బరిలోకి దిగి గెలుపు కోసం శ్రమిస్తోంది. కాంగ్రెస్ ప్రయత్నాలతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ముక్కోణపు పోటీగా మారాయి. ముస్లిం మైనారిటీలు, దళిత వర్గాల్లో పట్టున్న కాంగ్రెస్ పార్టీ.. ఆ వర్గాలు ఎక్కువ సంఖ్యలో నివసించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే ఇది పరోక్షంగా భారతీయ జనతా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారింది. ముస్లిం మైనారిటీ, దళిత ఓట్లను కాంగ్రెస్ పార్టీ చీల్చితే.. మిగతా ఓట్లలో మెజారిటీ ఓట్లను బీజేపీ కైవసం చేసుకోవడం సులభతరమవుతుంది. ఒకవేళ ఈ వర్గాలు ఆమ్ ఆద్మీ పార్టీ వెంట నిలిస్తే.. బీజేపీ గెలుపు కష్టతరమవుతుంది. ఈ పరిస్థితిని గ్రహించిన ఇండి-కూటమి పార్టీలు.. కాంగ్రెస్ ప్రయత్నాలను బహిరంగంగా విమర్శించకపోయినా.. తమ మద్దతు కేజ్రీవాల్‌కు ప్రకటించి ముక్కోణపు పోటీని కాస్తా ద్విముఖ పోరుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. తద్వారా ఆప్ విజయావకాశాలను దెబ్బతీయకుండా కాపాడాలని చూస్తున్నాయి. అస్సాం నేత బద్రుద్దీన్ అజ్మల్ ప్రకటన ఈ కోవలోనిదేనని అర్థమవుతోంది.

ముస్లిం ఇలాఖాలో మజ్లిస్ పార్టీ

ముస్లిం సమాజంలో పాపులారిటీ ఉన్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టి తన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించారు. వారిలో సీఏఏ వ్యతిరేక అల్లర్ల కేసు నిందితుడు షిఫా ఉర్ రెహమాన్‌ను ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ఓఖ్లా నియోజకవర్గం నుంచి బరిలోకి దించారు. పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరిగిన షహీన్‌బాగ్ ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. ఇక్కడ ముస్లిం జనాభా పెద్ద సంఖ్యలో నివసిస్తోంది. మరోవైపు నార్త్ ఈస్ట్ ఢిల్లీలో ముస్తాఫాబాద్ నుంచి ఆప్ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌కు ఎంఐఎం టికెట్ ఇచ్చింది. ఢిల్లీ అల్లర్ల కేసులో తాహిర్ హుస్సేన్ నిందితుడు. ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో జైల్లో ఉన్న ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వీలుకల్పిస్తూ.. కోర్టు 12 గంటల కస్టడీ పేరోల్ మంజూరుచేసింది. జైల్లో ఉన్న షిఫా ఉర్ రెహమాన్ తరఫున ఆయన భార్య నూరీన్ ఫాతిమా ప్రచారం చేస్తుండగా.. తాహిర్ హుస్సేన్ తరఫున షమా అంజుమ్ కూడా ప్రచారం చేస్తోంది. తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అసదుద్దీన్ ఓవైసీ కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తన సహజశైలిలో రెచ్చగొట్టే ప్రసంగాలతో ముస్లిం ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. జైల్లో ఉన్న నేతల తరఫున ఆడవాళ్లు చేస్తున్న ప్రచారం సెంటిమెంటును రాజేస్తోంది. మొత్తంగా ఈ రెండు ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ ప్రచారంలో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో ఈ %ూ×వీ×వీ% పోటీలో ఉన్నచోట ఆ పార్టీకి, లేనిచోట ఆమ్ ఆద్మీ పార్టీకి అన్న చందంగా ముస్లిం ఓటర్ల మనోగతం మారిందని కొందరు రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే ఢిల్లీలో గెలుపు ఎలాగూ సాధ్యం కాదని గ్రహించిందో.. మరే కారణమో.. కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో జోరు తగ్గించింది. తద్వారా ఎన్నికల్లో ముక్కోణపు పోటీ పరిస్థితిని నివారించి బీజేపీ విజయావకాశాలను దెబ్బతీయాలని చూస్తున్నట్టుగా అర్థమవుతోంది.

ఢిల్లీలో ఎస్పీ, టీఎంసీ ప్రచారం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతు ప్రకటించిన సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అర్వింద్ కేజ్రీవాల్‌తో కలిసి జనవరి 30న ఢిల్లీలో ఉమ్మడి రోడ్‌షో నిర్వహించనున్నారు రితాల నియోజకవర్గంలో వారి రోడ్ షో జరుగుతుందని తెలుస్తోంది. ఎస్పీకి చెందిన పలువురు ఎంపీలు కూడా ఆప్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ శతృఘ్న సిన్హా ఢిల్లీలో ఆప్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జనవరి 31న శతృఘ్న సిన్హా ప్రచారం చేస్తారని ఆప్ వర్గాలు తెలిపాయి. కాగా ఢిల్లీ అసెంబ్లీని 70 స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో ఎన్నికల నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2020 ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం 70 స్థానాల్లో 62లో ఆప్ గెలుపొందగా.. 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది.

మహాకుంభమేళా వేళ.. అయోధ్యకు పోటెత్తుతున్న భక్తులు..

ఒక్క రోజే 25 లక్షల మంది దర్శనం

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా కొనసాగుతోంది. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. మహాకుంభమేళా వేళ యూపీలోని ప్రఖ్యాత ప్రదేశం అయోధ్యకు కూడా భక్తులు పోటెత్తుతున్నారు. అయోధ్య రామ మందిరాన్ని సందర్శిస్తున్నారు. ముఖ్యంగా జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున అయోధ్యలోని రామ మందిరాన్ని 25 లక్షల మందికిపైగా భక్తులు సందర్శించినట్లు ఆలయ ట్రస్ట్ తెలిపింది. భక్తులు రామ్ లల్లాతోపాటు హనుమాన్‌గర్హి ఆలయాన్ని సందర్శిస్తున్నట్లు పేర్కొంది. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వస్తున్న భక్తులు అటునుంచి అయోధ్యకు వస్తున్నట్లు తెలిపింది. కాగా, భక్తుల రాకతో అయోధ్యా నగరి రద్దీగా మారింది. మరోవైపు రానున్న రోజుల్లో అయోధ్యకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రామ మందిరం, హనుమాన్ గర్హి ఆలయాల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించింది.

15 కోట్ల మంది పుణ్య స్నానాలు

త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు కోట్ల సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు తరలివస్తున్నారు. ఇప్పటికే 15 కోట్ల మంది మహాకుంభ్‌లో అమృత స్నానాలు చేశారు. అయితే రేపు మౌనీ అమావాస్య సందర్భంగా .. కుంభమేళాకు ఒక్క రోజే సుమారు పది కోట్ల మందికిపైగా వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీని కోసం యూపీ సర్కారు భారీగా ఏర్పాట్లు చేస్తున్నది. గడిచిన 17 రోజుల్లో ప్రతి రోజూ సుమారు కోటి మంది వరకు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. బుధవారం మౌనీ అమావాస్య కోసం భారీ ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

మౌనీ అమావాస్య ప్రత్యేకతేంటి..

మౌనీ అమావాస్య రోజున నదీ స్నానం విశేషమైంది. మహాకుంభమేళాలో అమావాస్య రోజున నిర్వహించే స్నానాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో రేపు ఉదయం 6.45 నిమిషాలకు .. త్రివేణి సంగమంలో స్నానం ఆచరించే భక్తులపై పూలవర్షం కురిపించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. షాహి స్నానం నిర్వహించే తేదీల్లో.. నాగ సాధువులు, అకాడాలు భారీ ర్యాలీగా నదీ తీరానికి చేరుకుం టారు. అమృత స్నాన దినాల్లో అదే ఆకర్షణీయమైంది. అయితే సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి.. ఒకే రేఖలోకి రావడం వల్ల.. పవిత్ర నదుల ఆధ్యాత్మిక శక్తి మరింత దిగ్విణీకృతం అవుతుందని భావిస్తారు. హిందూ క్యాలెండర్‌లోని మాఘ కృష్ణ అమావాస్య రోజున.. మౌనీ అమావాస్య వస్తుంది. అమృత స్నాన దినాల్లో.. మౌనీ అమావాస్య స్నానమే ప్రత్యేకమైందిగా భావిస్తారు. ఈ రోజున పవిత్ర నదీ జలం అమృతంలా మారుతుందని చెబుతుంటారు. మౌనీ అమావాస్యను సాధువులు స్నానం చేసే రోజు అని కూడా పేర్కొంటారు. సాంప్రదాయకర రీతిలో మౌనంగా మౌనీ అమావాస్య రోజున స్నానాన్ని ఆచరిస్తారు. జనవరి 28, 29, 30 తేదీల్లో ప్రయాగ్‌రాజ్‌లో స్కూళ్లకు సెలవు ప్రకటించారు.

31 నుండి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31న ప్రారంభం కానున్నాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడుతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడుత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. మంగళవారం విడుదలైన పార్లమెంటరీ బులిటెన్ ప్రకారం.. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న లోక్‌సభలో కేంద్ర బడ్జెట్-2025ను ప్రవేశపెడుతారు. అంతకుముందు రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి. పార్లమెంట్ సమావేశాలకు ముందురోజు జనవరి 30న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రాబోయే సమావేశాల్లో సభను సజావుగా నిర్వహించేందుకు ప్రతిపక్ష నాయకులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గతంలో సమావేశాలు జరిగిన తీరును ప్రస్తావించారు. రెండు సెషన్లలో పార్లమెంట్ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. దాంతో పార్లమెంట్ ప్రతిష్ట దెబ్బతిందని.. ఈ సమావేశాల్లోనైనా ప్రతిపక్ష నాయకులు, ఇతర ఎంపీలు చర్చల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షం సహకరిస్తేనే పార్లమెంట్ పని చేయడంతో పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సారి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెడుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సారి బడ్జెట్ బాగుటుందని అందరూ ఆశిస్తున్నారని తెలిపారు.

భారత జాలర్లపై శ్రీలంక నేవీ కాల్పులు

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన మత్స్యకారులపై శ్రీలంక నేవీ కాల్పులు జరపడంపై విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనలో ఐదుగురు మత్స్యకారులు గాయపడ్డారు. దీనిపై న్యూఢిల్లీలోని శ్రీలంక యాక్టింగ్ హైకమిషనర్‌కు భారత్ మంగళవారంనాడు సమన్లు పంపింది. తీవ్ర నిరసనను ఆయనకు తెలియజేసింది. శ్రీలంక తీరంలోని డెల్ఫ్ ఐలాండ్ సమీపానికి వెళ్లిన 13 మంది మత్స్యకారులను అక్కడి నౌకాదళం మంగళవారం తెల్లవారుజామున అడ్డుకుంది. పట్టుకునేందుకు కాల్పులు జరిగింది. ఈ కాల్పుల్లో ఇద్దరు భారత మత్స్యకారులు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆ వివరాలను, న్యూఢిల్లీ తీసుకున్న చర్యలను ఎంఈఏ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇండియాలోని శ్రీలంక హైకమిషనర్‌ను ఈరోజు ఉదయం పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసినట్టు పేర్కొంది. పడవలో 13 మంది మత్స్యకారులు ఉండగా, ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో జాఫ్నా టీచింగ్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారని, స్వల్పంగా గాయపడిన మరో ముగ్గురికి కూడా చికిత్స జరుగుతోందని తెలిపింది. మరోవైపు, జాఫ్నాలోని భారత కాన్సులేట్ అధికారులు సైతం ఆసుపత్రికి వెళ్లి గాయపడిన మత్సకారులను పరామర్శించారు. వారికి, వారి కుటుంబాలకు అవసరమైన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని కొలంబో లోని ఇండియన్ హైకమిషన్ సైతం శ్రీలంక విదేశాంగ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. "ఎట్టి పరిస్థితుల్లోనూ బలప్రయోగం చేయడం ఆమోదయోగ్యం కాదు. ఈ విషయంలో ఇరు ప్రభుత్వాల మధ్య ఉన్న అవగాహనకు తూ.చ. తప్పకుండా పాటించాలి" అని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. కాగా, శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసిన 13 మంది తమిళనాడు, కారైకాల్‌కు చెందిన మత్స్యకారులుగా తెలుస్తోంది.

ఎంఐఎం అభ్యర్థికి కస్టడీ పెరోల్..
రోజుకు 2 లక్షల డిపాజిట్

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేసుకునేందుకు ముస్తఫాబాద్ నియోజకవర్గం నుంచి ఏఐఎంఐఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహమ్మద్ తాహిర్ హుస్సేన్‌కు సుప్రీంకోర్టు మంగళవారంనాడు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది. ఆ ప్రకారం ప్రతిరోజూ పోలీసు ఎస్కార్ట్ మధ్యే జైలు నుంచి

బయటకు వెళ్లి 12 గంటల సేపు ఆయన ప్రచారం చేసుకోవచ్చు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకూ ఈ వెసులుబాటు కల్పించారు. కస్టడీ పెరోల్ కింద ఇద్దరు పోలీసు సిబ్బంది, జైలు వ్యాను, ఎస్కార్ట్ వాహనానికి అయ్యే ఖర్చు ఆయనే భరించాలని కోర్టు షరతు విధించింది. రోజుకు సుమారు 2 లక్షల చొప్పున రెండ్రోజుల అడ్వాన్స్ డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఢిల్లీ అల్లర్ల కేసు నిందితుడైన తాహిర్ హుస్సేన్ తన పార్టీ కార్యాలయానికి వెళ్లవచ్చని, తన నియోజకవర్గం ఓటర్లతో సమావేశం నిర్వహించుకోవచ్చని, అయితే కారవాల్ నగర్‌లోని తన సొంత ఇంటికి వెళ్లకూడదని కోర్టు ఆదేశించింది. తనపై ఉన్న పెండింగ్ కేసుల వ్యవహారంపై కూడా ఆయన మాట్లాడరాదని షరతు విధించింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం కోసం కస్టడీ పెరోల్ ఇవ్వాలని తాహిర్ హుస్సేన్ సుప్రీంకోర్టును మంగళవారంనాడు కోరారు. ఎన్నికల ప్రచారం ముగిసేందుకు కేవలం నాలుగైదు రోజులే ఉన్నందున పోలీసు కస్టడీలో ప్రచారం సాగించేందుకు తన క్లయింట్‌ను అనుమతించాలని హుస్సేన్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ అగర్వాల్ అభ్యర్థించారు. అయితే ఈ విజ్ఞప్తిని తోసిపుచ్చాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించారు. కోర్టు ఉపశమనం కలిగిస్తే ప్రతి ఒక్కరూ జైలు నుంచి నామినేషన్ వేస్తుంటారని అన్నారు. కాగా, తాత్కాలిక బెయిల్ కోరుతూ హుస్సేన్ చేసిన విజ్ఞప్తిని జనవరి 22న సుప్రీంకోర్టు నిరాకరించింది. ద్విసభ్య ధర్మాసనం పరస్పర విరుద్ధమైన తీర్పు ఇవ్వడంతో ఆయనకు బెయిల్ రాలేదు. దీనికి ముందు జనవరి 14 నామినేషన్ వేసేందుకు ఢిల్లీ హైకోర్టు ఆయనకు కస్టడీ పెరోల్ ఇచ్చింది. 2020 ఫిబ్రవరి 24న ఢిల్లీలో జరిగిన అల్లర్లలో 53 మంది ప్రాణాలు కోల్పోగా, ఇంటెలిజెన్స్ బ్యూరో స్టాఫర్ అకింత్ శర్మ మృతికి సంబంధించిన కేసులో హుస్సేన్ నిందితుడిగా ఉన్నారు.

రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థలు

-మొదటిపేజీ తరువాయి

సంబంధించి సింగపూర్ తో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, మన విద్యార్థులు సింగపూర్ కు వెళ్లి శిక్షణ పొందే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ ఆర్థిక స్థితిని దెబ్బకొట్టేందుకు ఎందరో ప్రయత్నిస్తున్నారని, కానీ సంస్థలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించడం గర్వించదగ్గ విషయమన్నారు. హైదరాబాద్ కు పెట్టుబడులు రాకుండా చేయాలని కుట్రలు చేశారని, ఎన్నో అపోహలు, అనుమానాలు సృష్టించారన్నారు. పక్కా ప్రణాళికతో దావోస్ కు వెళ్లాం కనుకే అన్ని పెట్టుబడులు సాధించామని సీఎం అన్నారు. 13 నెలల్లో రూ.లక్షా 80వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని సీఎం మరోమారు పునరుద్ఘాటిం చారు. తెలంగాణను వన్ ట్రిలియన్ ఎకానమిలో చేర్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కిల్ యూనివర్శిటీ స్థాపనతో యువతకు నైపుణ్యతతో కూడిన విద్యను అందిస్తామన్నారు. ప్రస్తుతం పెట్టుబడుల రాకతో, తెలంగాణ నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పనతో పాటు ఉపాధి అవకాశాలు చేరువ అవుతాయన్నారు. గతం కంటే 4 రెట్లు ఎక్కువగా పెట్టుబడులు సాధించడం తనకు ప్రజలు ఇచ్చిన బృహత్తర అవకాశంగా భావిస్తున్నట్లు తెలిపారు.

పైశాచిక ఆనందం పొందారు..

"విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకురావాలనేది మా ప్రయత్నం. వాళ్లు ఇక్కడి నుంచి విదేశాలకు నిధులు తరలించారు. ఇక్కడ కొల్లగొట్టిన సొమ్మునే విదేశీ పెట్టుబడులుగా చూపారు. మేం విఫలమైతే పైశాచిక ఆనందం పొందాలని కొందరు చూశారు. ఇతర రాష్ట్రాల కంటే గొప్పగా పెట్టుబడులు సాధించాం. అసూయతోనే మమ్మల్ని అభినందించడం లేదు. భారీ పెట్టుబడులు తేవడం చూసి కొందరికి కడుపుమంటగా ఉంది. ప్రతిపక్షంలో ఓ నేత అటెన్షన్ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. చాలా సంస్థలు మన పెవిలియన్‌కు వచ్చి ఒప్పందాలు చేసుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఈస్థాయిలో పెట్టుబడులు రాలేదనే అక్కసుతో ఉన్నారు. ఎనర్జీ పాలసీతోనే తెలంగాణలో పెట్టుబడులు పెరిగాయి. అంతర్జాతీయ సంస్థలను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు దావోస్ వెళ్లాం. ప్రపంచ ఆర్థిక సదస్సులో భారీగా పెట్టుబుడులపై ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణలో పెట్టుబడులపై కొందరు దుష్ప్రచారం చేశారు. కానీ ఇన్వెస్టర్లు మాపై పూర్తి విశ్వాసం ఉంచారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులతో... వ్యాపారవేత్తలు ముందుకు వచ్చారు. తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణకు భారీగా పెట్టుబడులు: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

దావోస్ పర్యటనలో గతేడాది కంటే నాలుగు రేట్లు ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రజలు, యువతకు మేలు చేయాలనేదే తమ ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. ఎన్ని విమర్శలు చేసినా సలహా లాగే తీసుకున్నామన్నారు. సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని అన్నారు. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ బరిగేలా ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చిందని చెప్పుకొచ్చారు. స్విట్జర్లాండ్‌కు చెందిన %ఖదీూ%, మల్టీవాక్ గ్రూప్‌తో ఒప్పందాలు చేసుకున్నామని వివరించారు. దావోస్ పర్యటనలో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని ఉద్ఘాటించారు. వన్ ట్రిలియన్ ఎకానమీ దిశగా అడుగుపడిందని చెప్పారు. మూసీ పునరుజ్జీవం, యువతకు ఉపాధిపై దృష్టిపెట్టామని తెలిపారు. మూసీని ప్రక్షాళన చేసి ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందిస్తామన్నారు. హైదరాబాద్ అంటేనే .. బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని చెప్పుకొచ్చారు. సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మారుస్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

రేవంత్‌రెడ్డి దృష్టిలో మోసం చేసుడు కూడా చారిత్రాత్మకమే

-మొదటిపేజీ తరువాయి

చూసుకున్నా పావులా వంతు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ హామీలపై ఇప్పుడు గ్రామ సభల్లో జనం నిలదీస్తుంటే పాలకుల దగ్గర సమాధానం లేదని చెప్పారు.

'ఎన్నికల ముందు రేవంత్ పెద్దపెద్ద మాటలు చెప్పిండు. అధికారంలోకి రాంగనే ఒకటే సంతకంతో రుణమాఫీ చేస్త అన్నడు. మరె ఇప్పుడు రుణమాఫీ జరిగిందా..? ఏ ఊర్లె గూడా 25 శాతం మందికి గూడా రుణమాఫీ కాలేదు. అసెంబ్లీలో ఇదే విషయమై నిలదీస్తే రేవంత్ రెడ్డి నోరు మెదపలే. ఏ ఊళ్లె అందరికీ రుణమాఫీ అయ్యిందో చూద్దాం పా.. అంటే సప్పుడు చెయ్యలే. అధికారంలోకి రాంగనే రుణమాఫీపై బ్యాంకులోళ్లందరినీ పిలిచి మాట్లాడిండ్రు. రుణమాఫీ కోసం రూ.45,500 కోట్లు కావాలె అని బ్యాంకులోళ్లు చెప్పిండ్రు. వారం రోజులకు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రూ.40 వేల కోట్లు సరిపోతయి అన్నడు. తర్వాత నెలకు రూ.31 వేల కోట్లు సరిపోతయన్నడు. ఆఖరికి జూన్‌లో క్యాబినెట్ మీటింగ్ పెట్టి రూ.26 వేల కోట్లు సరిపోతయని, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లే కేటాయించిండ్రు. కానీ ఇప్పటికీ రుణమాఫీకి ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.12 వేల కోట్లు కూడా దాటలే. అందుకే అంటున్న 49 వేల కోట్లల్ల పావులా వంతు కూడా రుణమాఫీ కాలేదు' అని కేటీఆర్ అన్నారు.

'ఇప్పుడు గ్రామ సభల్లో అధికారులను రైతులు నిలదీస్తున్నరు. ఏమాయె రుణమాఫీ అంటే సమాధానం లేదు. ఏమాయె ఆరు గ్యారంటీలు అంటే సమాధానం లేదు. కేసీఆర్ బిచ్చమేసినట్టు రూ.10 వేలే ఇస్తున్నడూ.. నేను రూ.15 వేలు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పిండు. మరె ఇస్తున్నడా రూ.15 వేలు..? ఆఖరికి రూ.12 వేలు ఇయ్యాలని నిర్ణయం జేసిండ్రు. పైగా అది చారిత్రాత్మక నిర్ణయం అని అంటున్నడు. మోసం చేసుడు గూడా చారిత్రాత్మకమేనా. ఆఖరికి రేషన్ కార్డు ఇయ్యడం కూడా చారిత్రాత్మకమట. ఏడాది నుంచి రాష్ట్రంలో రైతులను, గరీబులను ఈ ప్రభుత్వం చావగొడుతున్నది. రేషన్ కార్డు కావాలంటే దరఖాస్తు.. రైతు భరోసా అంటే దరఖాస్తు.. కులగణన అంటే దరఖాస్తు. ఇప్పుడు రాష్ట్రంలో ఎవరన్నా సంతోషంగా ఉన్నరా అంటే జిరాక్స్ సెంటర్లోల్లే. పెట్టిన దరఖాస్తే మళ్లీమళ్లీ పెట్టి ప్రజలు విసిగిపోతున్నరు' అని కేటీఆర్ చెప్పారు.

రైతుబంధు కొనసాగిస్తే ఆయననెవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయం : కేటీఆర్

రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని కొనసాగిస్తే ఆయనను ఎవరూ దేకరని, ఆ పథకాన్ని తీసుకొచ్చిన కేసీఆర్ పేరే నిలబడుతదనే భయం సీఎం రేవంత్ రెడ్డిలో ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. అందుకే రైతుబంధు ఇవ్వడంలేదని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థలు, పంచాయతీ ఎన్నికల కోసం రేవంత్ మళ్లీ రైతుభరోసా నాటకం ఆడుతున్నాడని, ఎన్నికలు అయిపోంగనే రైతుబంధు మళ్లీ బందేనని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను జనం నిలదీయాలని పిలుపునిచ్చారు. 'ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అన్ని పంటలకు క్వింటల్‌కు రూ.500 బోనస్ ఇస్తమన్నడు. మరె ఎవరికన్నా బోనస్ పైసలు పడ్డయా..? ఇప్పుడు మాట మార్చి సన్నవడ్లు పండిస్తెనే బోనస్ ఇస్తం అంటున్నరు. ఇగ వ్యవసాయ మంత్రి అయితే సన్నవడ్లకు బోనస్ ఇచ్చుడు బాగుంది, రైతు భరోసా అక్కెరే లేదని రైతులే చెప్తున్నరు అంటున్నడు. ఇప్పుడు ఎన్నికలు ఉన్నయ్ కాబట్టి రైతుభరోసా ఇస్తం అని నాటకమాడుతున్నరు. ఈ నాటకాలను మీరు గమనించాలె. ఎన్నికలు అయిపోంగనే రైతు భరోసా కూడా బందైతది' అని కేటీఆర్ హెచ్చరించారు. 'ఇప్పుడు ఆరోగ్య శ్రీ అంటే వైఎస్ఆర్ యాదికొస్తరు. రైతుబంధు అంటే కేసీఆర్ గుర్తుకొస్తరు. అందుకే రైతుబంధు ఇస్తే కేసీఆర్‌కే పేరు వస్తదని, ఆయనను ఎవరూ దేకరని రేవంత్‌రెడ్డి భయపడుతున్నడు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని మీరు ఇక్కడ గమనించాలె. కేసీఆర్ పేరు మోగొద్దంటే రైతుబంధు ఇయ్యొద్దు అన్నది రేవంత్ అభిప్రాయం. రైతుభరోసా పేరుతో రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం.. ఇప్పుడు రైతులకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ ఉన్నడు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లా ఓట్లు అడగడానికి వస్తరు. అప్పుడు ఈ బాకీ డబ్బులు అడుగుండ్రి. రుణమాఫీ ఏమైందని అడుగుండ్రి. ఏమైంది బోనస్ అని అడుగుండ్రి. ఆరుగ్యారంటీలు ఏమైనయని నిలదీయుండ్రి' అని కేటీఆర్ నల్లగొండ రైతులను కోరారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని అడుగుతున్నా : కేటీఆర్

నల్లగొండలో రైతు ధర్నాను అడ్డుకునేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్ని ప్రయత్నాలు చేశాడని, ఆఖరికి దివ్యాంగుడు అయిన బీఆర్ఎస్ నాయకుడు భూపాల్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో దాడి చేసిండ్రని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సిగ్గుందా అని తాను అడుగుతున్నానని ఆయన మండిపడ్డారు. నల్లగొండ గడ్డ నాడు సాయుధ రైతాంగ పోరాటానికి రాష్ట్ర రైతుల్లో స్ఫూర్తి నింపిందని, ఇప్పుడు కూడా రైతులు తిరగబడేందుకు నల్లగొండనే వేదిక కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ ఆనాడు మొత్తం రాష్ట్ర రైతాంగానికి సాయుధపోరాటంలో ఎట్లైతే స్ఫూర్తిని నింపిందో.. మళ్ల ఇప్పుడు గూడా అట్లనే నల్లగొండనే స్ఫూర్తి కావాలె. రైతులు తిరగబడుతందుకు నల్లగొండనే వేదిక కావాలె. అందుకే నల్లగొండ నుంచే ఈ రైతు పోరు మొదలుపెట్టినం. ఇంకా నాలుగేండ్ల సమయం ఉంది. మిమ్మల్ని అందరినీ నేను ప్రార్థించేది ఒక్కటే. కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధిచెప్పాలె. కేసీఆర్ తయారు చేసిన అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు అందరూ మీకు మద్దతు ఉంటరు. ఈ ప్రభుత్వంలో రైతుబంధు అడిగితే చెప్పుతో కొడుతా అనే మంత్రి ఒకడున్నడు. మీటింగ్ పెట్టుకుంటమంటే అడ్డుకునే సన్నాసి మంత్రి ఒకడున్నడు. భూపాల్‌రెడ్డిని తీస్కపోయి పోలీస్‌స్టేషన్‌ల దాడి చేసిండు. నీకు సిగ్గుందా అని అడుగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి' అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నీకు ధైర్యం ఉంటే, దమ్ముంటే గడియారం సెంటర్‌కు రా. మా లెక్కనే వచ్చి మీటింగ్ పెట్టి రైతులకు మీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పు' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ చేశారు. 'ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆకారాలు బాగా పెరిగినయ్. అహంకారాలు బాగా పెరిగినయ్. కానీ నల్లగొండకు వాళ్లు చేసిందేమీ లేదు. కానీ కేసీఆర్ ఏం చేసిండని మాట్లాడుతరు. కేసీఆర్ ఏం చేసిండో చెప్తున్నా. వరి ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ చేసిండు. నల్లగొండను తెలంగానలోనే నెంబర్ వన్ చేసిండు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిలో మూడు మెడికల్ కాలేజీలు కట్టిచ్చిండు. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది లక్ష్మీ నరసింహస్వామి రుణం తీర్చుకున్నడు. దామరచర్లలో తెలంగాణలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కట్టిచ్చిండు. చెప్పుకుంటే పోతే ఒకటి రెండు కాదో ఎన్నో పనులు చేసినం. దమ్ముంటే క్లాక్ టవర్‌కు రా.. మా భూపాలన్న, జగదీష్ అన్న వస్తరు. నీ సంగతి చెప్తరు' అని కేటీఆర్ హెచ్చరించారు. 'మనం హైకోరు ధన్యవాదాలు చెప్పాలె. మన న్యాయవ్యస్థకు ధన్యవాదాలు చెప్పాలె. ఎందుకంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసినా, రైతుల పోరాటంలో న్యాయం ఉందని అర్థం చేసుకుని ఇయ్యాల మనం ధర్నా చేసుకునేందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. సీఎం రాజ్‌భవన్ ముందు ధర్నా చేస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది కాదటగానీ, మనం ఇక్కడ ధర్నా చేస్తే ప్రభుత్వానికి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇబ్బంది అయితదట. నేను పోలీస్ అధికారులకు, జిల్లా అధికార యంత్రాంగానికి గుర్తుచేస్తున్న. మరిచిపోకండి. భవిష్యత్తు కచ్చితంగా గులాబీ జెండాదే. ముమ్మాటికి తిరిగివస్తాం. ఇయ్యాల ఎవరైతే కాంగ్రెస్ కార్యకర్తల కంటే అతిగా ప్రవర్తిస్తున్నరో అన్ని గుర్తుపెట్టుకుంటున్నం. వడ్డీతో సహా ఇస్తం. యాదికి పెట్టుకోండి' అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

ఆర్టీసీ సమ్మె సైరన్...

హైదరాబాద్ : తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధమైన కార్మిక సంఘాలు.. 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసులను ఆర్టీసీ యాజమాన్యా నికి అందించాయి.45 రోజుల్లోగా తమ సమస్యలను పరిష్కరించాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలలైనా తమ సమస్యలు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అటు, ఆర్టీసీ కార్మిక సంఘాల రాకతో పోలీసులు భారీగా మోహరించారు. తెలంగాణ ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత మరోసారి సమ్మె సైరన్ మోగబోతోంది. 21 డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మిక సంఘాలు ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీసులు అందజేయడం జరిగింది. 21 డిమాండ్లను సమ్మె నోటీసుల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా తమ సమస్యలు పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోయారుఎలక్ట్రిక్ బస్సుల పేరుతో డిపోలను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు కార్మిక సంఘాల నేతలు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో పాటు వేతనాల పెండింగ్ బకాయిల సమస్యలను పరిష్కరించాలన్నారు. మొత్తం 21 డిమాండ్లతో ఆర్టీసీ యాజమాన్యానికి కార్మిక సంఘాల నేతలు నోటీసులు ఇచ్చారు.తెలంగాణ ఆర్టీసీలో కార్మిక సంఘాలకు గుర్తింపు లేదు. భవిష్యత్తులో ఆర్టీసీ కార్మిక సంఘాలు ఉండవంటూ చెప్పే ప్రయత్నం గతంలో జరిగింది. ఈ క్రమంలో ఆర్టీసీ కార్మిక సంఘాలు యాజమాన్యానికి నోటీసులు ఇచ్చాయి. ఇప్పటికే ఆర్టీసీలో కార్మికులను గుర్తించాలంటూ కొన్ని యూనియన్లు లేబర్ కమిషన్ కు వెళ్లాయి. దానికి సంబంధించి హైకోర్టులో కొంత ఇష్యూ నడుస్తోంది.తాజాగా సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ ఆర్టీసీలో 21 డిమాండ్ల సమస్య పరిష్కారానికి కార్మిక సంఘాలు నోటీసులు జారీ చేయడంపై యాజమాన్యం ఏ విధంగా ముందుకు వెళ్తుంది అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి ఎండీ అందుబాటులో లేకపోవడంతో ఏడీ మునిశేఖర్ కి ఆర్టీసీ జేఏసీ కార్మిక సంఘాల నాయకులు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది.ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో డిపోలను ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తోందని కార్మిక సంఘాల నేతలు ప్రధానంగా చేస్తున్న ఆరోపణ. వీటితో పాటు గతంలో ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసేందుకు అప్పటి సర్కార్ కూడా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన కార్యచరణ సిద్ధం చేయాలన్నది డిమాండ్. దీంతో పాటు 2021 పీఆర్సీ, 2017 పెండింగ్ వేతనాలు చెల్లించాలంటున్నారు. ఇక, ఆర్టీసీ కార్మికులు ఎవరైనా రిటైర్ అయితే అతడికి రావాల్సిన బకాయిలు రావడం లేదని.. వాటిని సత్వరమే రిలీజ్ చేయాలన్నది మరో ప్రధాన డిమాండ్.ఇదిలా ఉంటే ఎలక్ట్రిక్ బస్సుల ఆవిర్భావంతో డ్రైవర్ల

ఎక్స్ పీరియం పార్క్ బాగా నచ్చింది

-మొదటిపేజీ తరువాయి

నాటారు. ఇక్కడ అద్భుతమైన కలాఖండాన్ని నిర్మించారు" అంటూ కొనియాడారు. ముఖ్యమంత్రి ఈ పార్క్‌ను చూసి ముచ్చట పడ్డారని తెలిపారు. ఈ పార్క్‌లో వెడ్డింగ్స్, ఈవెంట్స్ ప్లాన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పార్క్‌తో చాలా మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. రామ్‌దేవ్ ఒక వ్యాపారిలా కనిపించరని.. ఆయన ఒక కళాకారునిగానే కనిపిస్తారన్నారు. హైదరాబాద్ శివారులో ఎక్స్ పీరియం పార్క్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని.. అందుకే మనసుకు దగ్గరయ్యారని తెలిపారు. 25 ఏళ్ళుగా రామ్‌దేవ్ మొక్కలు, శిలలపై రీసెర్చ్ చేస్తున్నారని అన్నారు. ఎక్స్ పీరియం పార్క్ తెలంగాణ రాష్ట్రానికి అందం తెస్తుందని.. ఈ పార్క్ ను కళాహృదయంతో చూడాలని అన్నారు. ఎవరైనా భూములు ఉంటే రియల్ ఎస్టేట్ చేస్తున్నారని.. డబ్బులు ఉంటే వ్యాపారం చేస్తున్నారని.. కాని రాందేవ్ ఫ్యాషన్‌తో ఇక్కడ పార్క్ డెవలప్ చేశారని చెప్పారు. వచ్చే చలికాలంలో ఇక్కడ సినిమా షూటింగ్ చేస్తా అని చెప్పినట్లు మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు.

ఇది పనికిమాలిన పిటిషన్...

చిలుకూరులోని ప్రొద్దుటూరు వెస్టన్ సెంటర్‌లో ఎక్స్‌పీరియం పార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. 150 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలో రామ్‌దేవ్‌రావు ఏర్పాటు చేసిన పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు.

రేవంత్ లెక్కేంటో?

-మొదటిపేజీ తరువాయి

టర్ములు చాన్సిచ్చారని.. ఆలా ఎవరు పదవి చేపట్టినా పదేళ్లు చాన్స్ ఇస్తున్నారు. ఇప్పుడు తనకు కూడా రెండు సార్లు చాన్స్ ఇస్తారని రేవంత్ అంటున్నారు. ఆ నమ్మకం తనకు ఉందంటున్నారు. రేవంత్ రెడ్డి చెప్పిన అంశం చూడటానికి బాగుంది. అయితే వారెవరికీ రెండో సారి కావాలని అధికారం ఇవ్వలేదు. వారి పాలనా తీరు చూసే ఇచ్చారని రాజకీయవేత్తలు గుర్తు చేస్తున్నారు. రాజకీయాల్లో లాజిక్కులకు చాన్స్ లేదు. గత మూడు సార్లు ఒక్కో పార్టీ రెండు సార్లు గెలిపించారని వచ్చే ఎన్నికలలోనూ మరోసారి కాంగ్రెస్ ను గెలిపించాలన్న రూలేం లేదని అంటున్నారు. గతంతో పోలిస్తే రాజకీయాలు మారిపోతున్నాయి.కేంద్రంలో ప్రభుత్వంపై అసంతృప్తి పెద్దగా పెరగకపోయినా రాష్ట్రాల్లో మాత్రం ప్రభుత్వాలపై అసంతృప్తి పెరగడానికి ఎంతో కాలం పట్టడం లేదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి పదేళ్ల పాటు అధికారంలో ఉండాలన్న సంకల్పం ఉంది. రాజకీయాల్లో ఉన్న ఎవరికైనా అధికారాన్ని అందుకోవాలనే లక్ష్యం ఉంటుంది. అది అందుకున్న తర్వాత దాన్ని నిలబెట్టుకోవాలన్న ఆశయం ఏర్పడుతుంది. దానికి రేవంత్ రెడ్డి అతీతుడేమీ కాదు. ఆయనకు ఇంకా ప్లస్ పాయింట్ వయసు. యాభైల్లోనే ఆయన చేతికి సీఎం పీఠం వచ్చింది. కావాల్సినంత కష్టపడే ఓపిక ఉంటుంది. ఇప్పుడే ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిందని చెప్పడం కూడా తొందరపాటే. చివరి ఏడాదిలో జరిగే పాలనా పరమైన నిర్ణయాల ఆధారంగానే ప్రజలు ఎక్కువగా ఓటింగ్ ప్రయారిటీ తీసుకుంటారన్న అభిప్రాయం ఉంది. అందుకే లాజిక్కులకు కాకపోయినా రేవంత్ కు రెండో చాన్స్ లేదని మాత్రం చెప్పలేం.

రైతు భరోసా చిల్లర పంచాయితీనా ముఖ్యమంత్రి గారు..? సూటిగా ప్రశ్నించిన హరీశ్‌రావు

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ ఎలా ఉందంటే.. పెట్టుబడుల కట్టు కథను నమ్మించేందుకు శత విధాలా ప్రయత్నించి అట్టర్ ఫ్లాప్ అయినట్లు ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మీ ప్రెస్ రిలీజులు, మీ మీడియా కవరేజులు, మీ ఈనో స్టోరీలు ఎవరూ నమ్మడం లేదని చివరకు ప్రెస్‌మీట్ పెట్టావు అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఎప్పుడో అయిపోయిన దావోస్‌కు ఇప్పుడు ఎందుకు ఈ దావత్. దావోస్‌లో జరిగే ఎంవోయూలు అన్నీ కూడా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ మాత్రమే, ఎవరైనా ఓపెన్ టెండర్‌లో రావాల్సిందే.. అని ఆర్థిక మంత్రి భట్టి గారు అంటే, మీరేమో లక్షా 82 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు గప్పాలు చెబుతున్నారు. భట్టి గారు చెప్పింది నిజమా? మీ మాటలు నిజమా? రేవంత్ రెడ్డి గారూ.. అని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. పొంతన లేకుండా మీరు చెప్పిన కంపెనీలు, పెట్టుబడుల లెక్కలు యావత్ తెలంగాణ ప్రజానీకం గమనించింది. అంతా డొల్ల ప్రచారం అని తేలిపోయింది. రైతు భరోసా కోసం గంపెడు ఆశతో, కొండంత ఆందోళనతో ఎదురుచూస్తున్న రైతుల ఆరాటాన్ని చిల్లర పంచాయితీ అంటవా? ఇంతక ముందు రైతు బంధును బిచ్చం అన్నవు, ఇప్పుడు రైతు భరోసాను చిల్లర పంచాయతీ అంటున్నవు. సంక్రాంతికి ఇస్తానన్న సంగతి తేలిపోయింది, చబ్బీస్ (26) జనవరి చేదు మాత్రనే అయ్యింది, ఇప్పుడు మార్చి 31 దాకా గడువు పెంచినవు అని హరీశ్‌రావు మండిపడ్డారు. జర్నలిస్టులు ఇదేమని అడిగితే, చిల్లర పంచాయితీ అంటున్నవు. అప్పుల పాలవుతున్న రైతుల ఆవేదన పక్కన పెట్టి మీ ప్రచారం వినాలా? రైతుల అప్పులు ముఖ్యమా.? దావోస్ డప్పులు ముఖ్యమా..? మీ సెల్ఫ్ డబ్బాకు, మీ వెకిలి సెటైర్లకు కాలం చెల్లింది. ఇకనైనా కళ్ళు తెరువు రేవంత్ రెడ్డి. నీలో అటెన్షన్ డిక్రీసింగ్ డిజార్డర్ మొదలైంది. నీ మాటలు ఎవరు నమ్మడం లేదనే ఆందోళన పెరిగిపోయింది. మంచి మానసిక వైద్యుడిని సంప్రదించడం మంచిది అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు.

హైడ్రా అంటే నమ్మకం...

హైదరాబాద్ : హైదరాబాద్ డిజాస్టర్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్' ను ప్రజలు విశ్వసించారు. ఎందుకో తెలియదు కానీ.. దానికి ఫిర్యాదు చేస్తే తమ సమస్యకు వెంటనే పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. అందుకే హైడ్రా అధికారులు నిర్వహించే ప్రజావాణికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. ప్రతి సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించిన తర్వాత హైదరాబాద్ పరిధిలో ఉన్న అనేక ఆక్రమణల గురించి సమస్యలు ఎక్కువగా హైడ్రా అధికారులకు అందుతున్నాయి. ప్రతి సోమవారం క్రమం తప్పకుండా ప్రజావాణి నిర్వహిస్తుండటంతో ప్రజలు కూడా వారిని నమ్మి అక్కడకు వచ్చి వినతులను సమర్పిస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా హైదరాబాద్ నగర పరిధిలో అనేక ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. పోలీసులకు, రెవెన్యూ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించకున్నా లాభంలేదు. వ్యక్తిగతంగా తమ భూములను ఆక్రమించారని కొందరు, నాలాలను, చెరువులను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్నారని ఇలా అనేక రకాలుగా అక్రమాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ సమయంలో హైడ్రా రావడం, అది వేగంగా వెళ్లి బుల్ డోజర్ తో కూల్చివేతలను ప్రారంభిచండంతో ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడింది. మిగిలిన శాఖల అధికారులు చుట్టూ తిరిగే కంటే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆక్రమణలను తొలగిస్తారన్న నమ్మకం ఏర్పడింది. అందుకే ప్రతి సోమవారం జరిగే హైడ్రా ప్రజా వాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి తమ ఫిర్యాదులు అందచేస్తున్నారు. ఇప్పటి వరకూ వందలసంఖ్యలో ఫిర్యాదులు హైడ్రా అధికారులకు అందాయి. మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులపై కూడా కొన్ని ఫిర్యాదులు అందాయి. అయితే అందులో నిజానిజాలను పరిశీలించిన తర్వాత న్యాయపరమైన చిక్కులు ఏవీ లేకపోతే వెంటనే హైడ్రా అధికారులు రంగంలోకి దిగి కూల్చివేతలను ప్రారంభిస్తున్నారు. ప్రధానంగా నాలాలను, చెరువులను హైదరాబాద్ నగరంలో ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో వ్యక్తిగత సమస్యలు కూడా ఎక్కువగానే వస్తున్నట్లు హైడ్రా అధికారులు చెబుతున్నారు.

తెలంగాణ గీతం కథనానికి స్పందన

బొంతపల్లి కుంటలో మట్టి పోసిన వారిపై కేసు నమోదు

బొంతపల్లి కుంటపై తెలంగాణ గీతం దినపత్రికలో స్పెషల్ స్టోరీ

ఇబ్రహీంపట్నం28,జనవరి(తెలంగాణగీతం)
ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలోని బొంతపల్లి కుంటలో మొరం మట్టి పోసి ఎఫ్.టి.ఎల్ లో ఆక్రమణకు పాల్పడుతున్నారంటూ తెలంగాణ గీతం పత్రికలో మంగళవారం రోజున వచ్చిన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు.బొంతపల్లి కుంటలో మట్టి పోసిన వారిపై ఇబ్రహీంపట్నం తహసీల్దార్, పోలీస్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇరిగేషన్ అధికారులు. బొంతపల్లి కుంట చెరువు ఎన్ని ఏకరాలు ఖబ్జాకు గురైంది ఏంత,మిగిలిన భూమి ఏంతదానిపై త్వరలో పూర్తి వివరాలు స్వేకరించి వరుస కథనలతో తెలంగాణ గీతం దినపత్రికలో స్పెషల్ స్టోరీ. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో భూముల రేట్లు పెరగడంతో చెరువులు, కుంటలు, కాలువలు,ఖాబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా బొంతపల్లి కుంట చెరువు చూట్టు పెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరారు.

పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి

సిద్దిపేట : జిల్లాలో పదవ తరగతి పరీక్షలలో 100% ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక బద్ధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు మంగళవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మార్చి 21 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు సిద్ధం చేయడం కోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల, ప్రధానోపాధ్యాయులు,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లు, కేజీబీవీల ప్రత్యేక అధికారులతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల వారిగా పదవ తరగతి పరీక్షలలో పూర్తిస్థాయిలో ఉత్తీర్ణత సాధించడం కోసం ఆయా పాఠశాలలు అనుసరిస్తున్న విధానం గురించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల మాదిరిగానే జిల్లా పదవ తరగతి పరీక్షలో ఈ సంవత్సరం కూడా పై భాగంలో నిలిచేలా ప్రణాళిక బద్ధంగా పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేకంగా చదివించాలని అన్నారు. 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఇంకా నెలన్నర సమయం మాత్రమే ఉన్నందున ప్రతి ఒక్క విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల వెనుకబడి ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించి 100% ఉత్తీర్ణత తీసుకురావాలని అన్నారు. జనవరి

మొదటి వారం వరకే సిలబస్ పూర్తి అయినందున ప్రతిరోజు ఉదయం మరియు సాయంత్రం పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక సమయం కేటాయించి చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడు దత్తత తీసుకొని చదివించాలని అన్నారు. అదనపు సమయాల్లో చదివిస్తున్నందున విద్యార్థులకు స్నాక్స్ కొరకు 25 లక్షల రూపాయలు అందిస్తానని వాటిని ఉపయోగించి విద్యార్థులకు స్నాక్స్ అందించాలని అన్నారు. అన్ని సబ్జెక్టులలో ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలని విద్యార్థుల వారీగా టెస్టుల వారీగా అసైన్మెంట్ షీట్ అన్ని పాఠశాలలో ఉండాలని అన్నారు. అలాగే పిల్లల అభ్యసన స్థాయి విషయాన్ని పేరెంట్స్ కు తెలియజేసి పిల్లలు బాగా చదివేల వారిని కూడా ఇన్వాల్వ్ చేయాలని అన్నారు. అనాథలు మరియు నిరుపేద విద్యార్థుల పై వారి వ్యక్తిగత సమస్యలు ప్రభావం చూపకుండా వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అవసరమైతే ఇతర శాఖల సహకారం కూడా అందిస్తామని తెలిపారు. ఈ నెలన్నర రోజులు విద్యార్థులు ఆబ్సెంట్ కాకుండా చూడాలన్నారు. విద్యార్థులు స్వేచ్ఛ చదివే అవకాశం ఇవ్వాలని, వారికి పెట్టే ఆహారం కూడా పూర్తిస్థాయిలో తినేలా చూడాలని అన్నారు. విద్యార్థి జీవితంలో కీలకమైన ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే భవిష్యత్తులో ఎప్పటికీ మిమ్మల్ని విద్యార్థులు గుర్తుంచుకుంటారని ఉపాధ్యాయుల కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలు , కేజీబీవీ లలో 10815 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారని వారందరూ పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ద్వారా పరీక్షకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో ప్రైవేట్ స్కూళ్లలో 3309 మంది విద్యార్థులు 10 వ తరగతి చదువుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్ష సెక్రటరీ షౌకత్ అలీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మయ్య, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రమాదాలు

హైదరాబాద్/విజయవాడ : తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాలు చోటు చేసుకున్నాయి. ఏపీలోని నంద్యాల జిల్లాలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి చెందగా 9 మందికి గాయాలయ్యాయి. తెలంగాణలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు నలుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల (పరిధి చాపిరేవులలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 9 మందికి గాయాలయ్యాయి. చాపిరేవులకు చెందిన వెంకటమ్మ (70) ఇంటికి బేతంచర్ల మండలం పెండేకల్లు గ్రామానికి చెందిన సుబ్బమ్మ, రాముడు అనే బంధువులు సోమవారం రాత్రి వచ్చారు. వీరికి రాత్రి భోజనాలు వండిపెట్టి పొరపాటున గ్యాస్ ఆఫ్ చేయకుండా నిద్రపోయారు. ఈ క్రమంలో గ్యాస్ కొద్దికొద్దిగా లీకైంది. మంగళవారం తెల్లవారు జామున నిద్రలేచిన వెంకటమ్మ.. గ్యాస్ లీకైన విషయం గమనించకుండా వంటగదిలో లైట్ వేసింది. దీంతో సిలిండర్ పేలి మంటలు వ్యాపించా యి. పేలుడు ధాటికి మిద్దె పైకప్పు కొంతభాగం కూలిపోయింది. ఈ ప్రమాదంలో వెంకటమ్మతో పాటు దినేశ్ అనే పదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. బంధువులు సుబ్బమ్మ, రాయుడుతో పాటు మరికొంతమందికి గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నారు.

మితిమీరిన వేగంతో..

అటు, తెలంగాణలోని వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లి వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆరాంఘర్ ఫ్లైఓవర్‌పై ఓ బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. శివరాంపల్లి సమీపంలోకి రాగానే బైక్ ఎలక్ట్రికల్ పోల్‌ను ఢీకొట్టి డివైడర్ వైపు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. యువకులు బహదూర్ పురా నుంచి ఆరాంఘర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. మణికొండలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పదేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. తండ్రి స్కూటీపై కూతురిని స్కూల్‌కు డ్రాప్ చేయడానికి వెళ్తుండగా.. యాక్టివాను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ కింద పడి కూతురు అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రికి స్వల్ప గాయాలు కాగా.. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కింద పడి..

అటు, ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో ఓ యువకుడు బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. మహారాష్ట్రలోని వర్ణికి చెందిన యువకుడు బైక్‌పై తలమడుగు మండలం సుంకిడి నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తోన్న లారీ ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ గ్యాంగ్ రేప్ కేసులో నిందితులకు 25 ఏళ్ల జైలు

హైదరాబాద్ : 14 ఏళ్ల మైనర్ లంబాడా అమ్మాయిపై నలుగురు యువకులు అత్యాచారం చేశారు. ఈ ఘటన రెండు సంవత్సరాల క్రితం చత్రినాక వద్ద చోటు చేసుకుంది. నిందితులు, అమ్మాయిని మాయమాటలు చెప్పి ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు మద్యం తాగించేందుకు యత్నించారు. ఆమె నిరాకరించగా, నిందితులు ఆమెను లైంగికంగా వేధించారు. ఒకరు ఆమె పొట్టపై తన్నడంతో, ఆమె అచేతనంగా పడిపోయింది. కొన్ని గంటల తర్వాత, ఆమె స్పృహ లోకి వచ్చింది. తన బట్టలు చిరిగిపోయి ఉన్నాయని, శరీరంలో నొప్పిగా అనిపించిందని తెలిపింది. ఆపై, అక్కడి నుంచి బయటకు వచ్చి పరుగెత్తి.. తల్లిదండ్రులకు జరిగిన విషయం వివరించింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులపై సామూహిక అత్యాచారం, లైంగిక వేధింపు కేసు నమోదైంది.న్యాయ విచారణలో నిందితులు అమ్మాయిని వివాహం చేసుకోవాలని కోరారు. అయితే ఆమె న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించింది. మేజిస్ట్రేట్ సమక్షంలో నిర్వహించిన ఐడెంటిఫికేషన్ పరేడ్‌లో, బాలిక నిందితులను స్పష్టంగా గుర్తించింది. కోర్టులో పలుమార్లు నిందితుల తరపు న్యాయవాదులు క్రాస్ ఎక్జామినేషన్ చేసినా బాలిక ధైర్యంగా నిలబడిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. కోర్టు బాలికకు రూ.7 లక్షల పరిహారం మంజూరు చేసింది. అయితే, బాలికను ఈ ప్రమాదంలోకి లాగిన స్నేహితురాలు ఇంకా జువెనైల్ న్యాయ మండలిలో విచారణ ఎదుర్కొంటోంది.ఘటన జరిగిన సమయంలో బాధితురాలు మైనర్ గా ఉన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులకు కోర్టు కఠినమైన శిక్ష విధించింది. ఇద్దరు నిందితులకు 25 సంవత్సరాల శిక్ష విధించగా, మరో ఇద్దరికి 5 సంవత్సరాల శిక్ష విధించింది. ఘటన అనంతరం బాధిత బాలికను వివాహం చేసుకునేందుకు నిందితులు సిద్ధ పడ్డారు. కానీ బాలిక న్యాయపరమైన పోరాటాన్ని కొనసాగించి నిందితులకు శిక్ష పడేలా పోరాటం చేసిందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి...

జనవరి 28 ట తెలంగాణ గీతంఉః ప్రతినిధి పల్లె గిరి
కల్వకుర్తి మండలంలో పర్యటించిన సుంకిరెడ్డి రాఘవెందర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదాలలో మరణించిన తోటపల్లి గ్రామనికి చెందిన బంగారయ్య,మహేష్. మరియు నాగమ్మ కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబాలకు భరోసానిస్తూ అండగా ఉంటామని వారి తగు ఆర్థిక సహాయం అందజేశారు... అలాగే వెంకటాపూర్ గ్రామనికి చెందిన మృతుడు మాయని నాగరాజు కుటుంబాన్ని పరామర్శించి వారికి కూడా భరోసాగా ఆర్థిక సహాయం అందించడం జరిగింది అదే గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా పోతుగంటి బాబు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజే యడం జరిగింది... ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్ మాట్లాడుతూ... ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని వారి కుటుంబాలకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా అండగాల ఉంటామని తెలియజేశారు... ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రాజేష్ రెడ్డి ,యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు అనిల్ గౌడ్, సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి ,మండల అధ్యక్షులు బాలరాజు,సీనియర్ అనిల్, రాజశేఖర్,శ్రీనివాస్ గౌడ్, శ్రీను,ఇస్తారి,శివ,రవి,అనిల్ కుమార్, సంతోష్ కుమార్,కిరణ్,శంకర్ నాయక్,పరమేష్,సంతోష్,సురేష్, నాయక్ శంకర్,మల్లేష్,మహేందర్ , శేఖర్,తదితరులు

అతివేగంతో దడపుట్టిస్తున్న టిప్పర్లు

మాల్ నుండి ఇబ్రహీంపట్నం మీదగా అతివేగంతో వస్తున్నా మట్టి టిప్పర్లను చూస్తే భయం.. భయం

ఇబ్రహీంపట్నం హైవే పై ఓవర్ లోడ్ టిప్పర్లతో ఏ క్షణంలో ఏమి జరుగునో...

ఇబ్రహీంపట్నం28,జనవరి(తెలంగాణ గీతం) గత కొన్ని రోజులుగా మాల్ నుంచి టిక్కి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు ఇబ్రహీంపట్నం సాగర్ హై వేపై ప్రయాణికులకు దడపుట్టిస్తున్నాయి.అతివేగంతో టిప్పర్లు నడుస్తుండడంతో పాదచారులు. ద్విచక్రవాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఓవర్ లోడ్ మట్టి అతివేగంతో వెలుతుండ దంతో మట్టిజారి రోడ్డుపై పడుతోంది. ఒకేసారి ఐదారు టిప్పర్లు వేగంగా వెళ్లడంతో రోడ్డంతా దుమ్ముతో నిండి మట్టి కళ్లలో పడి వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మంగళవారం రోజున ఉదయం నుండి సాయంత్రం వరకు అతివేగంతో టిప్పర్లు వెళ్లడంతో ప్రయాణికులు భయంతో పక్కకు తప్పుకుంటున్నారు.అతివేగంతో టిప్పర్ల కారణంగా ఏక్షణం ఏప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని పాదచారులు, వాహనదారులు వాపోతున్నారు. అతివేగంతో వెళ్తున్నా టిర్లపై ఇబ్రహీంపట్నం అధికారులు టిప్పర్ల రాకపోకలపై తమ సిబ్బందితో నిఘా పెట్టించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక వాహనాదారులు కోరారు.

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ : ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతోందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కరీంనగర్ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన సోషల్ సైన్స్ ప్రదర్శనశాలను కలెక్టర్ ప్రారంభించారు.అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన ఫెరియో ఫెస్టా, కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో 2700 మంది విద్యార్థినిలు అభ్యసించడం గొప్ప విషయం అన్నారు. వీరంతా విజయం సాధించి వివిధ రంగాల్లో స్థిరపడాలని, తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఆర్థికంగా బాగుంటేనే మంచి చదువు చదవగలమని భావనను విడనాడాలని అన్నారు. ప్రభుత్వ రంగంలో అన్ని రకాల సౌకర్యాలతో కూడిన విద్య అందుబాటులో ఉందన్నారు. జిల్లా యంత్రాంగం తరపున కళాశాలకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులు ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణాన్ని సందర్శించేలా చూడాలని బాలికల అభివృద్ధి అధికారి కృపారాణిని ఆదేశించారు. అనంతరం కళాశాలలో డిపార్ట్మెంట్ వారీగా ఏర్పాటు చేసిన తరగతి గదులను, ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఎన్.సి.సి విద్యార్థులు కలెక్టర్ కు గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ప్రిన్సిపాల్ టీ.భాగ్యలక్ష్మి, ఎన్సిసి డాక్టర్ లెఫ్టినెంట్ ఆయేషా షేక్, అధ్యాపకులు, వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు.

మాట ఇచ్చాం.. అమలు చేశాం?

వనపర్తి : ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతి కోసం పాటుపడిందని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలలో భాగంగా జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం నుంచి రైతుల ఖాతాలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన డబ్బులను జమ చేస్తామని పేర్కొన్న రేవంత్ సర్కార్ ఇచ్చిన మాట ప్రకారమే సోమవారం నుంచి రైతు ఖాతాల్లో రైతు భరోసా డబ్బులను జమ చేస్తుందన్నారు.